కవితా కౌముది

# స్వస్తికి ఇటువైపు

ఎస్ ఆర్ బందా

అప్పటి పేజీల్లోకి ఉలికిపడి జారి
మడిచిన కాగితపు మర్మగంధంలోకి
పుసులు తుడుచుకుని కళ్ళు నులుముకుని
నాటి ఆకసమ్మీద నేటి తారలని
రెచ్చి అచ్చొత్తుతూ అంతర్ జ్ఞాన
ముద్రలని అతి భద్రంగా
ముద్దాడుతూ ముచ్చటపడుతూ..

ఘనీభవించిన అల భళ్ళున చిట్లినట్లు
ఎండిన చందమామ నుంచి
ఏదో వెన్నెల ముక్క విడివడినట్లు
అప్పటి గమకమింకా గగనమంతా
గంగా ఝరిగా మారి పారినట్లు

లయాత్మక రేఖలు చదరాల బరువు
క్రింద గిలగిలలాడినట్లు
ఎగరలేని నెమలి ఎగిరే పావురాన్ని వెక్కిరించినట్లు..

ఒక నరం వాల్వ్ తెరిచి ఇంకో ధమని మెలికవేసి
ఆలోచన ఉండచుట్టి అనంతంలోకి కిక్ కొట్టినట్లు

తెలిసిన క్షణాల సవ్వడి అపరిచిత రణాల వ్యూహాల్లో
అరకొరగా మిగిలినట్లు..

అంతా కొంత – కొత్తే అంతా ఉపసంహారోపనిషత్తులో ఊపిరి బిగబట్టి నిద్రించినట్లు....

★★★

# నాదమయం జగత్

చొప్పల్లి సంతోష్ కుమార్ శర్మ

ఎన్ని ఏళ్ల నాటిదో ఈ ఆలోచనల పరిణామం .........
ఉరుమూ,మెరుపూ,గాలీ,నీరూ,నిప్పూ,పుట్టుకా,మరణం
అన్నీ అద్భుతమనిపించిన అనాది  కాలం నుండీ,
క్లోనింగ్ జీవులనూ,కృత్రిమ మేధనూ సృష్టిస్తున్నఆధునిక కాలం వరకూ
అంతుచిక్కకుండా మేధావుల మెదళ్లను తొలచి వేస్తున్న ఎన్నో ప్రశ్నలు!
అంతరిక్షం అంతా కలియ తిరిగినా,
వేల బిగ్ బ్యాంగ్ లాంటి సిద్ధాంతాలు విశదీకరిస్తున్నా,
ఇప్పటికీ సృష్టికర్త అస్తిత్వంపై ఎన్నో ప్రశ్నలు.!!
జీవించడమే పరమావధిగా సాగిపోతున్న చిన్నజీవుల నుండీ,
జీవం పుట్టుకను శోధిస్తున్న బుద్ధిజీవుల వరకూ
అన్ని జీవులలో అంతర్లీనంగా ఉన్నది ఒకటే చేతనా శక్తి.
ప్రతి జీవిలో అణువణువునా ధ్వనిస్తున్న నాదం,
చిరుగాలి తాకిడిలో లేత చిగుళ్ల మందహాసం,
సెలయేటి సవ్వడిలో గాలిపాపల మృదుగానం ,
ప్రకృతీ పురుషుల సమాగమంతో పరవశించిన పుడమి నాదం,
తొలి చినుకుల అలికిడితో పలకరింపునందుకున్న నేలతల్లి తడిగానం ,
ప్రకృతి అంతా నాదమయమే ..!!
ప్రకృతి నాదంతో అనునాదం చెందిన మనసు మాత్రమే
సృష్టి రహస్యానికి ప్రణమిల్లుతుంది....!!

★★★







# నేనే ఇంకా మారటం లేదు చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

తెల్లని వెన్నెల వీధులు ........ఇంద్రధనుస్సు రంగులు.....
చిన్నప్పటి ఆటలు .......సీతాకోక చిలుకలు
తృప్తిగా నవ్వుకునే నగ్న సంచారాలు
నా మూడో నేత్రం చూస్తున్న విచిత్ర ప్రపంచం -
మెలకువ వచ్చి చూస్తే
అది ఏ మూలో నా మనస్సులోనే వుంది
దాన్ని లయం చేసుకొన్నశివుడిని నేనే
హృదయ మైథునం లో వస్తున్నహాలాహలాన్ని...
మింగేసిన నాకు అభిషేకం కావాలి.
విజయ దరహాసం కావాలి
నా ప్రయత్నమంతా దానికే
నేనో సృష్టికర్తని అవుతున్నా..
నా కులం మారుతుంది........... నా మతం మారుతుంది.... కాని...
నేనే ఇంకా మారటం లేదు ......
మారతాను.......ఇది నేను నాతో చేసుకొన్న యుద్ధ ప్రతిపాదన .....
విజయం కూతవేటు దూరంలోనే వుందట ....!!!
మా చారులు స్పష్టమైన సమాచారం తెచ్చారు
నా కొత్త రాజ్యం లోకి ఆహ్వాన పత్రాలు పంపిస్తా తప్పక రండి
బంధు,మిత్ర,సపరివార సమేతంగా

★★★



# తథాగతం

కవితా ప్రసాద్

అప్పుడు తెలియకున్నా
ఆ తర్వాతెప్పుడో తెలిసింది
పుట్టడమనేది ఒకటుందని !
తెలియనిది ..అదే.. ఎందుకని ?
మరి తెలియనిది పుట్టినాక ఏమిటని?
పుట్టినందుకు పుట్టపుట్టువులా
సంసారాన్నో.. సమాజాన్నో
సంగతించడమో.. సంఘటించడమో చెయ్యాలి కదా!
అందరిలాగే పెరిగాను
చదువు..ఉద్యోగం! పెళ్ళాం..పిల్లలు!
ఆకలేస్తే అన్నం తిన్నాను
అరక్కపోతే మందులు తిన్నాను
పురుగులా పుస్తకాల్ని తొలిచాను
పురుషార్థ సాధనకంటూ తీర్థాలు తిరిగాను
పిత్రు పిండాలు పెట్టాను .. గుళ్ళను దర్శించాను
దేవ దూతలనూ పాదస్పర్శించాను..కొంచెం బిచ్చమూ
విదిలించాను
హోమాలతో స్వర్గ "బీమా"నూ చేశాను
శక్తి..భక్తి..రక్తి..ముక్తి..
ప్రవచనకర్తల తర్క వక్తృత్వోక్తులు విన్నాను!
ప్రశ్నకు తుదిబదులేదీ?.. తెలియ రాలేదు!
వినా దైన్యేన జీవనం
అనాయాసేన మరణం
ఇదేనా!.. ఇంతేనా జీవన పరమార్థం !
ఆలోచనామగ్నుడనై అదాటున క్రింద పడ్డాను
ఆసరా ఇచ్చి లేపింది అ ఆ లు చదివే పాప
అకల్మషాంతరంగ స్వరూప !

ఎదురుగా కనుపించాయి
పక్షులు వాలిన చెట్టు కొమ్మలు
ముసలమ్మ ఆనిన చెట్టు మొదలు
కదలని ఈచెట్టు ఎప్పుడు పుట్టిందో!.. తెలియదు !
ఎందుకు పుట్టానని పట్టించుకున్నట్లూ లేదు
ఎప్పుడో మోడౌతానేమోననే అందోళనా రాదు
నేల ఆలంబనిస్తోంది, అకాశం అచ్ఛాదిస్తోంది
అరుణుడు శక్తినిస్తున్నాడు, వరుణుడు నీళ్ళు పోస్తున్నాడు
గాలి ఊసులాడుతోంది
చివరి(కో)నాడు అగ్ని ఆశ్లేషిస్తుంది
అలా ఒంటిగా మౌన సైనికుడిలా..ప్రకృతిలో మమైక్యమై
పరార్థ జీవనమే పరమార్థ భావమని..జీవపరమాత్మునైన ఋషిలా!
పచ్చ మొక్కై తిండి పెడ్తోంది..ఎండు గడ్డై పాల నిస్తోంది
జబ్బుకి మందౌతోంది..నారై, దారమై బట్టనిస్తోంది
కలపై ఇంటినిస్తోంది..దూలమై ఇంటిని మోస్తోంది
ద్వారమై కావలికాస్తోంది..ఆకులతో ఇంటికప్పునిస్తోంది
ఇల్లాలి పూలకొప్పై అనురాగమిస్తోంది!
వంటచెరకై పంటచెర్కకై..పక్వాన్న పరమాన్నాల నిస్తోంది
పాడెయై నిన్ను మోస్తోంది..చితియై సాగనంపుతోంది
కడకు తనకు చితి కూడా తానే ఔతోంది
తన నీడలో నిలబడితే పహారా కాస్తోంది
తన మొదట్లో కూలబడితే ఆసరా ఇస్తోంది
బోధివృక్షమై నిన్ను బుద్ధుణ్ణి చేస్తోంది!
విశ్వశ్రే యోబద్ధుణ్ణి చేస్తోంది !
ఆ..! పుట్టు గిట్టుల మధ్య గుట్టు రట్టయింది!
చేతనైనట్లు బ్రతకడం కాదు..
చేరి చేయూతనిస్తూ బ్రతకటమని !

★★★

# విహరిస్తావ్ రఘు ఆళ్ళ

ఒకసారలా
విహారానికెళ్లొద్దాం...రా..!
ఆ తావుల్లో ఎదురేగేది
ఆ కోనల్లో ఎగిరేది
చూస్తుండు నాతో
చెమటలారిన బీడు దేహాలు
చిగురొచ్చి రాలిన కాసిన్ని ఆకులు!
దేనికి పుష్పించాయో తెలియని
తెల్ల మొహాలేసిన
నలిగిన నల్లటి పువ్వులు కొన్ని,
చరిత్రలో బద్దలైన రాళ్లు మరిన్ని,
చెంపలూడిన చెదచెరళ్లు ఇంకొన్ని!
వాటి గమనాన్ని వాటినెతుక్కుంటున్న
చలి చీమలు
కలి పాములు
సాయానికి సోలిన చేతులు
గాయానికి లేచిన రాతలు
పగటినే చూడని రాత్రులు.
విహారంలో అగుపిస్తాయక్కడ!
సమాహారమైనట్లు
సమావేశమైనట్లు
నీ కోసమే
ఉన్నట్లుంటాయ్!
నా చేతిని పట్టుకున్న
గడియారపు బాటలో...!
ఇప్పుడు చూడు
నీకు నువ్వుగానే
నీ నవ్వులో విహరిస్తుంటావ్...
నీ గడియారాపు ముళ్ల మధ్య,
వెనక్కి తిరుగుతూ..
ముందుకు సాగుతూ...
విహరిస్తున్నావ్ చూడిప్పుడు!!!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి


ఉల్లిపొర వంటి జీవితమొక్కటుండె
చితికిపోవక ముందు నీ చెంతనుందు
నిత్యమూహింతు నీదు సన్నిధిని నిలువ
కలలు కందును ప్రేమరాగములు కనగ

కిరణములు వ్రాలు నేలకంబరమునుండి
మబ్బులను తప్పుకొని శ్వేతమార్గములను
తిమిరమును దూరమొనరించు తేజమట్లు
ప్రేమ రాహిత్యమును బాపు వెలుగులట్లు

ఈ వెలుగు రేఖలీ ధరయెల్ల నిండి
ప్రేమతత్వమ్మునెంత నేర్పినను గాని
ఏల మనుజులీ యానందమెరుగలేరు?
ఎన్నడును రణోల్బణము కాంక్షించుచుంద్రు?

ఇంత రమణీయమైనట్టి యీ సుధాత్రి
నెవరు గీచెదరీ రేఖలెందు కొరకు?
కలిసియున్నట్టి కాలము కలగ మార్చి
పుడమినెందుకు విభజింప బూనుచుంద్రు?

చెలియ! యానందమున నిన్ను చేరబోవ
విడివడునిదేమి మనమధ్య పుడమి యిట్లు?
విరిగిపోవునే మనమధ్య విరియు ప్రేమ
విస్మయమ్మున దేశమ్ము విరిగినపుడు?


చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS